AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
1-9-2025 (Thursday)
MAIN EDITION

## రికార్డు స్థాయికి బంగారం ధర



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** కొద్ది రోజులుగా బంగారం ధర పరుగులు పెడుతోంది. పండుగ సీజన్‌లో ఇలా బంగారం ధరలకు రెక్కలు రావడంతో సామాన్యులు ఉలిక్కిపడుతున్నారు. ట్రంప్ సుంకాల కారణంగా పెట్టుబడిదారులలో అనిశ్చితి వాతావరణం ఏర్పడడంతో చాలా మంది సురక్షితమైన మార్గాన్ని ఎంచుకుంటున్నారు. మరోవైపు ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గించాలని భావిస్తున్న నేపథ్యంలో ధరలు పైపైకి పోతున్నాయి. గురువారం 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,06,980కు చేరుకోగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 98,060గా నమోదైంది. ఇక వెండి కిలో ధర హైదరాబాద్‌లో రూ. 1,37,100గా ఉంది.

## రూ.51 లక్షలు పలికిన గణపతి లడ్డూ



**అక్షరటుడే, హైదరాబాద్ :** వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. పలుచోట్ల విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు. ఇందులో భాగంగా లడ్డూలను వేలం వేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని మైహోమ్ భుజాలో వినాయకుడి లడ్డూ వేలం వేయగా ఏకంగా రూ.51.77 లక్షలు పలికింది. కొండపల్లి గణేష్ అనే వ్యక్తి వేలంలో లడ్డూను దక్కించుకున్నాడు. కాగా.. గతేడాది రూ.29 లక్షలు పలికింది.

# వరద బాధితులను ఆదుకుంటాం



- సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం
- కొడంగల్‌తో సమానంగా కామారెడ్డి అభివృద్ధి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

**భారీవర్షాలతో నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తాత్కాలిక పనులు వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాశ్వత పనుల నిమిత్తం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కామారెడ్డి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలను మంత్రులతో కలిసి గురువారం సందర్శించారు. కామారెడ్డి, ఎల్లారెడ్డిలో తీవ్రంగా దెబ్బతిన్న పంటలు, వంతెనలను పరిశీలించారు. అనంతరం లింగంపల్లి వంతెన వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆ తర్వాత ఆయన కామా రెడ్డిలోని హౌసింగ్ బోర్డు కాలనీ.. జీఆర్ కాలనీల్లో వరద బాధితులతో మాట్లాడారు.**

**–అక్షరటుడే, కామారెడ్డి ప్రతినిధి**

భారీ వరదలతో కామారెడ్డి జిల్లా తీవ్రంగా ప్రభావితమైందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వరద బాధితులతో మాట్లాడిన అనంతరం ఆయన ప్రసంగించారు. వరదలతో ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి చాలా తీవ్రంగా ఉందన్నారు. తాత్కాలికంగా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడతానని తెలిపారు. శాశ్వత పనుల కోసం ప్రత్యేక నిధులు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇసుక మేటలు వేసిన పొలాలను తిరిగి సాగుకు యోగ్యంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ధ్వంసమైన రోడ్లు, తెగిపోయిన చెరువుల మరమ్మతులకు శాశ్వత ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**అధికారులు ఎంతో శ్రమించారు..**

వరదలు వచ్చిన సమయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రాణ నష్టం జరుగకుండా చూశారని సీఎం ప్రశంసించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని సూచించినట్లు తెలిపారు. సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తెగిన చెరువులు, కుంటలు, రోడ్లని బాగు చేయిస్తామని చెప్పారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని అధికారులను ఆదేశించారు. వరదలో కొట్టుకు పోయిన పిల్లలకు పాఠ్య పుస్తకాలు అందజేయడం కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. కొడంగల్‌తో సమానంగా కామారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని సీఎం పేర్కొన్నారు. ఈ జిల్లాకు ప్రత్యేకంగా సహాయం అందించడానికి ఎల్లవేళలా ముందుంటానని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్ రావు, వెంకట రమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ జిల్లా అధికారులు ఉన్నారు.



## బ్యాట్స్‌మెన్ శిఖర్ ధావన్‌కు ఈడీ సమన్లు

**అక్షరటుడే, స్పోర్ట్స్‌డెస్క్ :** దేశవ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్న బెట్టింగ్ యాప్ కేసు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. నిషేధిత బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన వ్యవహారంపై ఇప్పటికే పలు రంగాల ప్రముఖులు ఈడీ విచారణను ఎదుర్కొంటున్నారు. తాజాగా టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్‌కు కూడా ఈ కేసులో ఈడీ నోటీసులు జారీ అయ్యాయి.

**శిఖర్‌కి సమన్లు..**

ఈడీ అధికారులు శిఖర్ ధావన్‌కు సమన్లు జారీ చేశారు. 1xBet అనే యాప్‌కు సంబంధించి మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇటీవలే మాజీ క్రికెటర్ సురేశ్ రైనా ఈడీ ముందు హాజరై తన వాంగ్మూలాన్ని ఇచ్చారు. ఇప్పటికే ఈ కేసులో విచారణ కొనసాగుతుండగా, కొత్త గా శిఖర్ ధావన్ పేరు రావడం చర్చనీయాంశమైంది.



## దేశంలో టాప్ విద్యాసంస్థలివే..

**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్ :** దేశంలో అత్యుత్తమ విద్యాసంస్థల జాబితాను కేంద్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. ఎప్పటిలాగే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ అగ్రస్థానంలో నిలిచింది. ఓవరాల్, ఇంజినీరింగ్ విభాగాల్లో నంబర్‌వన్ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. వర్సిటీలు, కాలేజీలు, ఇంజినీరింగ్ కళాశాలలకు సంబంధించి కేంద్రం విడుదల చేసిన నాలుగు జాబితాల్లో తెలంగాణ నుంచి ఒక్క హైదరాబాద్ ఐఐటీకి మినహా మిగతా వర్సిటీలు, కాలేజీలకు చోటు దక్కలేదు.

**ఐఐటీలివే..**

NIRF ర్యాంకింగ్స్‌లో పది అత్యుత్తమ ఐఐటీలలో మద్రాస్ ఐఐటీ తొలి స్థానంలో నిలిచింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూరు రెండో స్థానంలో, బాంబే ఐఐటీ మూడో స్థానానికి పరిమితమయ్యాయి. ఇక, ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ రూర్కీ, ఎయిమ్స్ ఢిల్లీ, జేఎన్‌యూ, బనారస్ హిందూ యూనివర్సిటీ వారణాసి టాప్ 10 జాబితాలో చోటు దక్కించుకున్నాయి.

**టాప్-10 వర్సిటీలు..**


ఇక దేశంలో అత్యుత్తమ వర్సిటీల్లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూరు టాప్ ప్లేస్ సాధించింది. జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ రెండు, మూడు స్థానాలలో నిలిచాయి. జామియా మిలియా ఇస్లామియా, న్యూఢిల్లీ, ఢిల్లీ విశ్వవిద్యాలయం, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్, పిలానీ, అమృత విశ్వ విద్యాపీఠం, కోయంబత్తూర్, జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయం, కోల్‌కతా, అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం టాప్ 10 వర్సిటీల్లో చోటు దక్కించుకున్నాయి.



## త్వరలో ఐపీవోకు ఫోన్‌పే..

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ప్రముఖ డిజిటల్ చెల్లింపుల సంస్థ ఫోన్ పే త్వరలోనే ఐపీవోకు రానుంది. 10 శాతం ఈక్విటీని విక్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఫోన్‌పే దేశంలో ప్రధాన డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్‌గా మారింది. కోట్లాది మంది వినియోగదారులున్న ఫోన్ పే.. ఐపీవోకు వచ్చేందుకు సిద్ధమైంది. రహస్య ఫైలింగ్ మార్గాన్ని ఎంచుకుని సెప్టెంబర్ చివరి నాటికి ఐపీవో కోసం దాఖలు చేయవచ్చని ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. అయితే, ఎంత మేర వాటా విక్రయిస్తారన్న దానిపై ఇప్పటిదాకా స్పష్టత రాలేదు. ప్రతిపాదిత ఐపీవోలో దాదాపు 10 శాతం ఈక్విటీని అమ్మకానికి పెట్టొచ్చని సమాచారం. దాదాపు రూ. 13,000 కోట్ల వరకు సేకరించవచ్చని తెలిసింది. ప్రస్తుతం కంపెనీ విలువ దాదాపు 10 - 12 బిలియన్ డాలర్లు ఉండగా, సుమారు 1.2 - 1.5 బిలియన్ డాలర్లను ఐపీవో ద్వారా సేకరిస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

## నయా దారుల్లో డ్రగ్స్ దందా.. ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ మహా నగరంలో డ్రగ్స్ దందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నా విక్రయాలు మాత్రం ఆగడం లేదు. నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ వినియోగం పెరగడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో డ్రగ్స్ దందాను అరికట్టడానికి ప్రభుత్వం ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ టీమ్ దాడులు చేపట్టి డ్రగ్స్, గంజాయి విక్రయాలు జరిపే వారిని అరెస్ట్ చేస్తోంది. దీంతో డ్రగ్స్ ముఠా కొత్త దారులు ఎంచుకుంటోంది.

**గ్లిండర్ యాప్‌తో..**

ఈగల్ టీమ్ డ్రగ్స్ దందా అడ్డుకునేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది. దీంతో ముఠాలు కొత్త మార్గాలు ఎంచుకుంటున్నాయి. కాగా.. నగరంలో ఓ ముఠా యాప్ ద్వారా డ్రగ్స్ విక్రయాలు జరుపుతోంది. గ్రిండర్ యాప్ ద్వారా డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 100 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. పది మందిని అరెస్ట్ చేశారు. వారిలో ఇద్దరు డ్రగ్ పెడ్లర్లు ఉన్నారు.

## జార్ఖండ్‌లో ఎదురుకాల్పులు.. ఇద్దరు భద్రతా సిబ్బంది మృతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** జార్ఖండ్‌లో కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్‌లో ఇద్దరు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పలము జిల్లాలో నిషేధిత తృతీయ సమ్మేళన్ ప్రస్తుతి కమిటీ, సీపీఐ (మావోయిస్ట్) చీలిక సంస్థ సభ్యుల కదలికల గురించి గురువారం సమాచారం అందడంతో పోలీసులు కూంబింగ్ ప్రారంభించారు. ఈ క్రమంలో తీవ్రవాదులు, పోలీసుల మధ్య కాల్పులు జరిగాయి. ఈ నేపథ్యంలో ఇద్దరు పోలీసులు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. తప్పించుకుపోయిన తీవ్రవాదుల కోసం భద్రతా బలగాలు గాలిస్తున్నాయి. తృతీయ సమ్మేళన్ ప్రస్తుతి కమిటీ కమాండర్ శశికాంత్ గంజు ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. కాగా.. అతడి తలపై రూ.10 లక్షల రివార్డు ఉంది.

## దక్షిణ రైల్వేలో అప్రెంటిస్ పోస్టులు..




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** దక్షిణ రైల్వేలో అప్రెంటిస్ అవకాశాలు కల్పించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తి ఉన్న అభ్యర్థులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మొత్తం 3,518 ఖాళీలను భర్తీ చేయనుంది.

**విభాగాల వారీగా..**

**క్యారేజ్ అండ్ వ్యాగన్స్ వర్క్స్, పెరంబూరు :** 1,394 పోస్టులు
**సెంట్రల్ వర్క్ షాప్, గోల్డెన్ రాక్ :** 857
**సిగ్నల్ అండ్ టెలికాం వర్క్ షాప్ యూనిట్స్, పొడనూర్, కోయంబత్తూర్ :** 1,267
**విద్యార్హత :** పోస్టును అనుసరించి ఇంటర్, పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు.
**వయో పరిమితి :** ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 15 ఏళ్ల నుంచి 24 ఏళ్లలోపు వారు అర్హులు.
**స్టైఫండ్ :** నెలకు రూ. 6 వేలనుంచి రూ. 7 వేల వరకు..
**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
**దరఖాస్తు గడువు :** ఈనెల 25.
**ఎంపిక విధానం:** అభ్యర్థుల విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా డాక్యుమెంట్ వెరిఫికేషన్ అనంతరం అర్హులను ఎంపిక చేస్తారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ https://sr.indianrailways.gov.in/లో సంప్రదించగలరు.

## ఇండియాపై మరిన్ని చర్యలు: ట్రంప్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** భారత్‌పై గుర్రుగా ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలని సూచించారు. లేకపోతే మరిన్ని చర్యలు తప్పవని హెచ్చరించారు. వైట్ హౌస్‌లో పోలిష్ అధ్యక్షుడితో సంయుక్త విలేకరుల సమావేశంలో మాట్లాడిన ట్రంప్ ఫేజ్ 2, 3 చర్యలు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. రష్యా నుంచి చమురు కొంటున్నారన్న కారణాన్ని చూపుతూ అమెరికా ఇప్పటికే భారత్‌పై 50 శాతం టారిఫ్ విధించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ దేశ ఇంధన అవసరాలతో పాటు ప్రపంచ ఇంధన ధరల స్థిరీకరణ దృష్ట్యా తక్కువ ధరకే లభిస్తున్న రష్యా నుంచి భారత్ కొనుగోలు చేస్తోంది. మాస్కో నుంచి అత్యధికంగా ఇంధన కొనుగోలు చేస్తున్న దేశంగా ఇండియా నిలిచింది. దాదాపు 35 శాతం వరకూ నుంచి దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ మరోసారి హెచ్చరించారు.

**ఇంకా ఫేజ్ 2, ఫేజ్ 3 సుంకాలు విధించలేదు**


మాస్కో నుంచి ఇంధన దిగుమతులను కొనసాగిస్తే న్యూఢిల్లీ మరిన్ని జరిమానాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రంప్ పేర్కొన్నారు. రష్యాతో వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తున్న దేశాలపై అమెరికా ఇంకా ఫేజ్ 2, ఫేజ్ 3 సుంకాలను విధించలేదని హెచ్చరించారు. అయితే, రష్యాపై ఎందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించగా.. భారత్‌పై ద్వితీయ ఆంక్షలు విధించడం రష్యాపై ప్రత్యక్ష చర్య అని ట్రంప్ అన్నారు. దీని వల్ల రష్యాకు వందల బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లిందని తెలిపారు.

## 'బాస్టియన్'ను పూర్తిగా మూసివేయడం లేదు: శిల్పాశెట్టి




**అక్షరటుడే, సినిమా డెస్క్ :** బాలీవుడ్ బ్యూటీ శిల్పా శెట్టి తీసుకున్న తాజా నిర్ణయం సినీ, ఫుడ్ లవర్స్ అందరినీ షాక్‌కు గురి చేసింది. ముంబైలోని బాంద్రాలో ఏర్పాటు చేసిన ప్రఖ్యాత రెస్టారెంట్ 'బాస్టియన్'ను మూసి వేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. గురువారం రెస్టారెంట్ చివరి కార్యకలాపాలు జరగనున్నాయి. ఈ రోజు రాత్రి తన వ్యాపార భాగస్వాములు, సన్నిహిత మిత్రుల కోసం ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తున్నట్లు శిల్పా తెలిపారు. "ఈ గురువారం మేము బాస్టియన్ బాంద్రాకు వీడ్కోలు చెబుతున్నాం. ఇది మాకు ఎన్నో అపురూప జ్ఞాపకాలను, మరచిపోలేని అనుభవాలను ఇచ్చింది. అయితే 'నేను బాస్టియన్‌ని పూర్తిగా మూసివేయడం లేదు. సౌత్ డిషెస్‌తో మంగుళూరు వంటకాలు మీకు రుచి చూపించేందుకు సరికొత్తగా మీ ముందుకు వస్తాం' అని శిల్పా శెట్టి స్పష్టం చేసింది.

## జీఎస్టీపై మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** వస్తు సేవల పన్ను(జీఎస్టీ) హేతుబద్ధీకరణ, రేటు తగ్గింపులపై కాంగ్రెస్ విభిన్నంగా స్పందించింది. మోదీ ప్రభుత్వం చెప్పిన ఒక దేశం.. ఒక పన్ను నినాదం ఇప్పుడు ఒక దేశం 9 పన్నులుగా మార్చిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. కాంగ్రెస్ దశాబ్ద కాలంగా జీఎస్టీ సరళీకరణకు డిమాండ్ చేస్తోందని గుర్తుచేశారు. సంక్లిష్టమైన జీఎస్టీ విధానం సూక్ష్మ, చిన్న మధ్యతరహా సంస్థలు, చిరు వ్యాపారాలను తీవ్రంగా ప్రభావితం చేసిందని ఖర్గే పేర్కొన్నారు. "దాదాపు ఒక దశాబ్ద కాలంగా కాంగ్రెస్ జీఎస్టీ సరళీకరణను డిమాండ్ చేస్తోంది. మోదీ ప్రభుత్వం "ఒక దేశం, ఒక పన్ను" ను "ఒక దేశం, 9 పన్నులు"గా మార్చింది" అని ఖర్గే 'ఎక్స్'లో విమర్శించారు. 2014, 2019 మ్యానిఫెస్టోలలో కాంగ్రెస్ పార్టీ సరళమైన, హేతుబద్ధమైన పన్ను వ్యవస్థతో జీఎస్టీ 2.0ని తెస్తామని, ఎంఎస్‌ఎంఈలు, చిన్న వ్యాపారాలను తీవ్రంగా ప్రభావితం చేసిన సంక్లిష్టమైన జీఎస్టీ సమ్మతిని సరళీకృతం చేయాలని నిర్ణయించిందని తెలిపారు.

**నాడు వ్యతిరేకించి..**

కాంగ్రెస్ ప్రభుత్వం జీఎస్టీ బిల్లును తీసుకొచ్చినప్పుడు బీజేపీ వ్యతిరేకించిందని ఖర్గే గుర్తు చేశారు. అప్పట్లో గుజరాత్ సీఎంగా మోదీ కూడా జీఎస్టీని తప్పుబట్టారన్నారు. అదే మోదీ ఇప్పుడు జీఎస్టీ పేరిట సామాన్యుల ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తూ తన ఘనతగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. "ఫిబ్రవరి 28, 2005న, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం లోక్‌సభలో జీఎస్టీని ప్రకటించింది. 2011లో అప్పటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ జీఎస్టీ బిల్లును ప్రవేశ పెట్టగా బీజేపీ వ్యతిరేకించింది. మోదీ సీఎంగా ఉన్నప్పుడు జీఎస్టీని తీవ్రంగా వ్యతిరేకించారు. నేడు అదే బీజేపీ ప్రభుత్వం రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూలు చేస్తోంది. సామాన్యుల నుంచి అధిక పన్నులు వసూలు చేయడం విజయంగా చెప్పుకుంటోందని" ఖర్గే మండిపడ్డారు.